క్లుప్తంగా

వాల్మీకి విగ్రహావిష్కరణ



పెద్దకొత్తపల్లి: వాల్మీకి విగ్రహాన్ని వావిళ్లబావిలో కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రపంచానికి రామాయణం ఆదికావ్యాన్ని అందించిన మహర్షి వాల్మీకిని మనమెప్పుడూ గుర్తించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నాగరాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గణేష్‌రావు, మాజీ జెడ్పీటీసీ వెంకటయ్య, వెంకటేశ్వర్‌రావు, కుర్మయ్య, నాగరాజు, కాశన్న తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

తెలకపల్లి: మండలంలోని వివిధ గ్రామాలను నాగర్‌కర్నూల్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి శనివారం సందర్శించారు. తెలకపల్లి, కమ్మరెడ్డిపల్లి, నెల్లికుదురు, వట్టిపల్లి, బొప్పల్లి, ఆలేరు, పెద్దపల్లితోపాటు జమిస్తాపూర్, కార్వంగ, నడిగడ్డ, తాళ్లపల్లి, గౌరారం, పర్వతాపూర్, రాకొండ గ్రామాలలో పోలింగ్ బూత్‌లను సందర్శించారు. పోలింగ్ బూత్‌లలో సౌకర్యాలతోపాటు ఇతర వివరాలు పరిశీలించారు. ఆర్డీఓ వెంట తహసిల్దార్ మురళీమోహన్, ఆర్‌ఐలు రామస్వామి, శ్రీనివాసరావు, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలు సిద్ధం చేసుకోండి

చారకొండ: గ్రామాల్లో మొక్కలు నాటేందుకు వన నర్సరీలను త్వరగా సిద్ధం చేయాలని ఎంపీడీఓ జయసుధ అన్నారు. మండలంలోని జూపల్లిలో శనివారం ఎంపీడీఓ నర్సరీ, ప్రకృతి వనాలను పరిశీలించారు. నర్సరీలో చేపడుతున్న పనులను పరిశీలించారు. అనంతరం ప్రస్తుతం నర్సరీలో ఉన్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఈసీ రవి, టీఏ యాదయ్య, పంచాయతీ కార్యదర్శి మల్లేష్ ఉన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

చారకొండ: మండలంలోని జూపల్లిలో గ్యార్వీ వేడుకల సందర్భంగా శనివారం మహబూబ్ సుభాని దర్గాలో దీపారాధన, ఫతేహా నిర్వహించారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు హాజరై దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా కమిటీ ఆధ్వర్యంలో కందూరు నిర్వహించారు. దర్గా వద్ద కల్వకుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శ

బల్మూర్: మండలంలోని లక్ష్మీపల్లికి చెందిన వంశీగౌడ్(33) అకాల మృతి చెందడంతో శనివారం అమ్రాబాద్ జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు శ్రీపతిరావు, కాశన్నయాదవ్, తదితరులు ఉన్నారు.

నియామకపత్రం అందజేత

పెంట్లవెల్లి: మండల బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గోవురాజును ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి శనివారం నియమించి, నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా గోవురాజు మాట్లాడుతూ ఈ అవకాశం కలిపించినందుకు ఎమ్మెల్యే గెలుపునకు కృషి చేస్తానని, నాయకులకు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

తల్లిదండ్రులు హాజరుకావాలి

లింగాల: పాఠశాలల్లో తరచుగా నిర్వహించే పీటీఎం సమావేశాలకు తల్లిదండ్రులు హాజరుకావాలని కమ్యూనిటీ మొబిలైజింగ్ జిల్లా అధికారి వెంకటయ్య తెలిపారు. శనివారం మండలంలోని అంబట్‌పల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో గల అవుసలికుంట ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పీటీఎం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పాఠశాలల అభివృద్ధికి సహకారం అందివ్వాలని సూచించారు.

బియ్యం అందజేత

కోడేరు: మండల కేంద్రానికి చెందిన యాపచెట్టు బాలస్వామి ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో ఆ కుటుంబానికి బీఆర్‌ఎస్ నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, జగదీశ్వర్‌రావు రెండు క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు. గతంలో భార్య కూడా చనిపోవడంతో పిల్లలు అనాథలుగా మారారు. పిల్లలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని వారికి భరోసా ఇచ్చారు.

అనిరుధ్‌రెడ్డి ఎంపికపై సంబరాలు

ఊర్కొండ: కాంగ్రెస్ పార్టీ జడ్చర్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా అనిరుధ్‌రెడ్డిని ఎంపిక చేయడంతో కార్యకర్తలు, నాయకులు బాణాసంచా కాల్చి శనివారం సంబరాలు చేసుకున్నారు. అనిరుధ్‌రెడ్డిని గెలిపించేందుకు తమవంతుగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీలో చేర్చండి

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వాల్మీకి జయంతిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా వాల్మీకి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా పలుచోట్ల వాల్మీకి విగ్రహాన్ని, చిత్రపటాలను ఊరేగించారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం నాయకులు మాట్లాడుతూ.. ప్రతి సంక్షేమ పథకాలు వాల్మీకులకు అందేవిధంగా చూడాలని కోరారు. వాల్మీకి బోయల జనాభా ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు అసెంబ్లీ ఎన్నికలలో పోటీచేసేందుకు సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా భారీ బైక్‌ర్యాలీలు చేపట్టారు. రిజర్వేషన్లలో న్యాయం, బీసీ రుణాలు, ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం సహకరించాలని వారు డిమాండ్ చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



బిజినేపల్లిలో వాల్మీకి చిత్రపటం ఊరేగిస్తున్న గ్రామస్తులు



మాచుపల్లిలో..



లింగాల మండలం అంబట్‌పల్లిలో..



అచ్చంపేటలో పూజలు చేస్తున్న నాయకులు

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి



గెలుపొందిన జట్టుకు కప్‌ను అందిస్తున్న నిర్వాహకులు

అచ్చంపేట రూరల్: నల్లమల ప్రాంతంలో క్రీడాకారులకు కొదవలేదని, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు సూచించారు. శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో అచ్చంపేట ప్రీమియర్ లీగ్ సీజన్–5 క్రికెట్ టోర్నీ ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. విజేతగా ఎస్ఎస్ ఇన్‌ఫ్రా జట్టు నిలిచింది. రన్నర్‌గా వెంకట్ బిల్డర్స్ నిలిచారు. విన్నర్ జట్టుకు కప్‌ను అందించారు. టోర్నీలో ఏడు టీంలు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, కౌన్సిలర్లు, షేక్ సజ్జాద్, షేక్ సాధిక్, నిర్వాహకులు పాల్గొన్నారు.

పాలస్తీనాకు అండగా ఉండాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: యుఎన్ఓ తీర్మానాన్ని అమలు చేసి పాలస్తీనా స్వరాజ్య హక్కులను కాపాడాలని దీనికోసం అండగా ఉండాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని గాంధీపార్క్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. హింస ఎప్పటికీ పరిష్కారం కాదని అది విధ్వంసం, బాధలకు దారి తీస్తుందని, శాంతియుత పరిష్కారాన్ని తీసుకురావడంలో అంతర్జాతీయంగా కృషిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇజ్రాయిల్ సైన్యం నాలుగు వారాల క్రితం ప్రారంభించిన దాడుల వల్ల ఇప్పటి వరకు 9వేల మంది ప్రాణాలు కోల్పోయారని అందులో పాలస్తీనాకు చెందిన 7,800 మందికి పైగా ఉన్నారన్నారు. ఇజ్రాయిల్, హమాస్ మధ్య ఆధిపత్యం కోసం నాలుగు యుద్ధాలతో 4వేల మంది మృతి చెందారని పేర్కొన్నారు. ఫలితంగా పాలస్తీనీయులకు ఆహారం, నీరు, నిత్యావసరాలు, ఔషధాలు అందక ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని, ఆస్పత్రిలో రోగులకు వైద్య అందక ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. కార్యక్రమంలో పర్వతాలు, కృష్ణయ్య, ధర్మయ్య, వెంకటస్వామి, పాదిల రామయ్య, దశరథం, శ్రీనివాసులు, బాలస్వామి, బాలయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



గాంధీపార్క్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి



చౌటపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు



చారకొండలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

అచ్చంపేట రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం సంక్షేమ పథకాలను అమలు చేసిందని, ఆ పథకాలే పార్టీని అధికారంలోకి తీసుకవస్తాయని రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ అన్నారు. శనివారం మండలంలోని లింగోటం, చౌటపల్లి, చౌటపల్లి తండా, పట్టణంలోని పలు వార్డులలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో తులసీరాం, కౌన్సిలర్ రమేష్‌రావు, లోక్యానాయక్, కుత్బోద్దీన్, పర్వతాలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

చారకొండ: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, ముఖ్య నాయకులు శనివారం అచ్చంపేటలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నివాసంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. పార్టీని నమ్మి వచ్చిన నాయకులకు నాయకత్వాన్ని మరింత బలపరుస్తామన్నారు.

తాడూరు: మండలంలోని చర్లిటిక్యాలకు చెందిన కాంగ్రెస్‌తోపాటు ఇతర పార్టీ కార్యకర్తలు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు యారరమేష్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు.

మన్ననూర్: స్థానిక లింగమయ్య కాలనీకి చెందిన 25 మంది కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామ సర్పంచ్ నేనావత్ శ్రీరాం ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

బీఎస్పీతోనే బహుజనులకు న్యాయం

తెలకపల్లి: మండల కేంద్రంలో బీఎస్పీ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. బహుజనులకు న్యాయం, రాజ్యాధికారం దక్కాలంటే బీఎస్పీతోనే సాధ్యమన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా కొత్తపల్లి కుమార్ ఉన్నారని ఆయనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శివశంకర్, దీపక్, సృజన, శ్రీకాంత్, సందీప్, భాస్కర్, శివ, లక్ష్మణ్, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడు మృతి

కొల్లాపూర్: పట్టణానికి చెందిన రిటైర్డ్ వెటర్నరీ ఉద్యోగి, తెలంగాణ ఉద్యమకారుడు కంటి రామస్వామి(62) శనివారం ఉదయం మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కొల్లాపూర్ జేఏసీ చైర్మన్‌గా ఈయన పనిచేశారు. ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. ఆయన మృతికి రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, టీఎన్‌జీఓ, ఉద్యోగ సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

గువ్వల బాలరాజుపై చిన్నారుల అభిమానం

అచ్చంపేట రూరల్: పట్టణానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు సోమేష్ చౌహాన్ (5వ తరగతి), వరుణ్ చౌహాన్ (3వ తరగతి) చదువుతున్నారు. వీరిద్దరు దాచుకున్న డబ్బులు రూ.3,220 ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నామినేషన్ కోసం శనివారం పట్టణంలోని ఆయన స్వగృహంలో అందించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

సభను విజయవంతం చేయాలి

పెద్దకొత్తపల్లి: కొల్లాపూర్‌లో ఈ నెల 31న పాలమూరు ప్రజాభేరి సభకు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం పార్టీ గ్రామాల అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. కార్యకర్తలు, అభిమానులు పాలమూరు ప్రజాభేరి సభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పాపిరెడ్డి, ఫరీద్, జంగయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసిన నాయకులు

కందనూలు: పీఆర్‌టీయూ గౌరవ అధ్యక్షుడు, ఉపాధ్యాయుడు రామచందర్ రావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు విద్యార్థి సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. బంజార, గిరిజన విద్యార్థి సంఘం నాయకుడు భరత్ మాట్లాడుతూ.. కొల్లాపూర్ పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్‌లో రామచందర్‌రావు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ.. తనకు ఉన్న పలుకుబడితో బడికి వెళ్లకుండా, డీఈఓ కార్యాలయంలో పైరవీకారుడిగా మారాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధులు నిర్వహించాల్సిన సమయంలో ఇతర బాధ్యతలు చూస్తూ.. పాఠశాల కంటే వ్యక్తిగత పనులకే ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఆయనపై విచారణ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడుదాం



నిరసన తెలుపుతున్న నాయకులు

తాడూరు: దళిత హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించే దళిత సమ్మిట్ జిల్లా సదస్సును జయప్రదం చేయాలని దళిత నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కాశన్న, భరత్ మాట్లాడుతూ దళితుల హక్కుల కోసం డిసెంబర్ 4న జాతీయ స్థాయిలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో రెండు సార్లు అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం దళితులపై దాడులు, హింస పేట్రేగిపోయాయని విమర్శించారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలన్నీ నిర్వీర్యం చేస్తున్నారన్నారు. దళితులపై దాడులు, హత్యలు, అరాచకాలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో అర్జున్, మశన్న, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..



పార్టీలోకి చేరిన వారితో నారాయణరెడ్డి

కల్వకుర్తి టౌన్: ఎన్నికలలో తప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ నారాయణరెడ్డి అన్నారు. శనివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీకాంత్‌తో పాటుగా, పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరగా, కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికలలోపు చాలా మంది బీఆర్‌ఎస్ నాయకులు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరతారని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అణుగుణంగా పార్టీ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడేరు: కాంగ్రెస్ పార్టీతోనే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం జనుంపల్లిలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో అమ్ముడుపోయిన నాయకులకు బుద్ధి చెప్పాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

అమ్రాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని డీసీసీ ఉపాధ్యక్షుడు కొయ్యల శ్రీనివాసులు, కుంద మల్లికార్జున్ కోరారు. శనివారం మండలంలోని ఒంగురోనిపల్లి, మాధవానిపల్లిలో ఇంటింటికీ తిరిగి గ్యారంటి కార్డులను పంపిణీ చేసి వివరించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన వివిధ పార్టీల నాయకులు సింగల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కాంగ్రెస్ పార్టీలో చేశారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి కండువాలతో ఆహ్వానించారు.

రాజకీయ భవిష్యత్‌పై త్వరలో కార్యాచరణ

కొల్లాపూర్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం మైనార్టీ సెల్ నాయకులు సమావేశమయ్యారు. తమ నాయకుడు చింతలపల్లి జగదీశ్వర్‌రావుకు పార్టీ టికెట్ రాకపోవడం, జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్ అభ్యర్థి కావడం వంటి అంశాలపై మాట్లాడారు. జగదీశ్వర్‌రావువర్గానికి చెందిన తామంతా రాజకీయ భవిష్యత్ కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తామని వెల్లడించారు. సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు బాలపీరు, ప్రధాన కార్యదర్శి సయ్యద్, హుస్సేన్, మహ్మద్, జహంగీర్, వహీద్, నిరంజన్, అబూబాకర్, నజీర్, షబ్బీర్ తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతాలు

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయం ఆవరణలో తిరుమల తిరుపతి దేవస్థానం హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. ప్రధాన అర్చకులు రామాచారి, సుదర్శనాచారి వేద మంత్రాల మధ్య 21 జంటలు వ్రతాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

మాధారం సబ్‌స్టేషన్ వద్ద రైతుల ధర్నా



ఊర్కొండ: మండలంలోని రేవల్లి ఫీడర్‌పై ఓవర్ లోడ్ అధిగమించాలనే సాకు చూపి ఎలికట్ల ఫీడర్‌లోని మాధారంను కల్వకుర్తి మండలంలోని వెంకటాపూర్ సబ్‌స్టేషన్‌కు బదిలీ చేయడం దారుణమని రైతులు వాపోయారు. శనివారం మదారం చెందిన వ్యవసాయ రైతులు స్థానిక సబ్‌స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. శుక్రవారం కరెంట్ సరఫరా నిలిపివేయడం వల్ల పంట పొలాలకు నీరు పారించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వంటావార్పు చేసి భోజనం చేశారు. తక్షణమే తమ గ్రామాన్ని ఎలికట్ల ఫీడర్‌లోకి డిమాండ్ చేశారు.

పార్టీ కార్యాలయం ప్రారంభం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని గాంధీనగర్‌లో శనివారం బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ ప్రారంభించారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలి వారు కోరారు.

వరిదేల శమీవృక్షం వద్ద ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కొల్లాపూర్: పట్టణంలోని వరిదేల శమీవృక్షం వద్ద శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవికి భక్తులు సమర్పించిన వడి బియ్యంతో భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు. భక్తులు శమీవృక్షాన్ని దర్శించుకుని సహపంక్తి భోజనాలు చేశారు.

జిల్లా సరిహద్దుల్లో కట్టుదిట్టంగా నిఘా



జటప్రోల్ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్‌లో అంతర్ జిల్లా వనపర్తి, నాగర్‌కర్నూల్ సరిహద్దుల్లో చెక్‌పోస్ట్ వద్ద శనివారం స్థానిక ఎస్ఐ బండారి సురేష్ తనిఖీ చేపట్టారు. ఎవరైన కోడ్‌ను ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ అన్నారు.

తాడూరు: మండల కేంద్రంలో శనివారం చెక్‌పాయింట్‌ను ఏర్పాటు చేశారు. ఎస్ఎఫ్‌సీ అధికారి శ్రీనివాసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల సమయం వరకు నెల రోజులపాటు ప్రతి రోజు తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.

అమ్రాబాద్: పదర మద్దిమడుగు ప్రధాన రహదారిపై శనివారం సాయంత్రం పోలీసులు వాహనాలను తనిఖీ నిర్వహించారు. వాహనాల పత్రాలు, లైసెన్స్‌లు పరిశీలించారు. ఎన్నికల కోడ్‌అమలులో ఉన్నందున నిబంధనలు ఉల్లంఘించి వాహనాల్లో మద్యం, నగదు తీసుకెళ్లవద్దని ఎస్ఐ తిరుపతి రెడ్డి సూచించారు.

ఆర్టీసీ బస్సుల తనిఖీ

పెద్దకొత్తపల్లి: అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలు కావడంతో మండలంలో పోలీసు తనిఖీలు ముమ్మరం చేశారు. ముష్టిపల్లి స్టేజీ వద్ద ఏర్పాటు చేసి పోలీస్ చెక్ పోస్ట్ వద్ద హెడ్ కానిస్టుబుల్ కుర్మయ్య ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులు, మోటారు సైకిళ్ల తనిఖీ చేశారు. బస్సుల్లో ప్రయాణికుల సంచులు, బ్యాగులను పరిశీలించారు.



పదరలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు